# రామనామమే మేలు!

# రామచింతనే చాలు!

**ఖండఖండాంతర ఖ్యాతి నార్జించిన**
**మహనీయులను గన్న మాతృభూమి**
**పాశ్చాత్య వీరుల పారద్రోలించియు**
**స్వాతంత్ర్యమును గన్న సమరభూమి**
**పాండిత్యమున చాల ప్రఖ్యాతి గాంచియు**
**ప్రతిభ చూపించిన భరతభూమి**
**సంగీత సాహిత్య శాస్త్రీయ విద్యల**
**ధీశక్తి చూపిన దివ్యభూమి**
**చిత్రకళలతోడ చిత్రమైయున్నట్టి**
**భరతభూమియందు జననమొంది**
**భరతమాత ధర్మభాగ్యంబు కాపాడ**
**బాధ్యతంతయు మీదె భక్తులార!**

ఈనాడు మన భారతదేశమునందు ఎందరో ధనవంతులూ, మేధావులూ, నాయకులూ ఉన్నారు. కాని, ఉండి ఫలమేమి? వారిలో ఒక్కరైనను తమ స్వార్థమును వీడి సమాజసేవకొరకు జీవితమును అర్పితము చేయువారు కానరారు. పవిత్రమైన భరత భూమియందు జననమొందిన మీరు సమాజసేవలో ప్రవేశించి మీ జన్మమును ధన్యము గావించుకొనుటకై ప్రయత్నించాలి.



srisathyasaivachanamrutam

**ఆధ్యాత్మిక విద్య నేర్వనిచో అన్ని విద్యలూ వ్యర్థములే!**

ప్రేమస్వరూపులారా! దీనికి పూర్వము డాక్టరు, జడ్జి ఇద్దరుకూడను మీకు స్వామియొక్క విషయములు వివరించారు. కాని, ఇవన్నీకూడను కేవలం ప్రాకృత మయిన విషయములే తప్ప ఆధ్యాత్మిక విషయములు కావు. మీరు ఎన్ని విద్యలు నేర్చినప్పటికినీ ముఖ్యంగా ఆధ్యాత్మిక విద్య నేర్వనప్పుడు అన్నీకూడను వ్యర్థములే! ఈనాటి మానవునికి ఒక్క ఆత్మవిశ్వాసము (సెల్ఫ్ కాన్ఫిడెన్స్) తప్ప అన్నీ ఉన్నాయి. 'సెల్ఫ్ కాన్ఫిడెన్స్' అనే పదములో 'సెల్ఫ్' అనగా 'నేను'. 'నేను' అనగా దేహము అని మీరు భావిస్తున్నారు. అది భౌతికమైనది. అది నిజమైన 'సెల్ఫ్' కాదు. ఏదీ కానటువంటిది ఏదో అదే 'సెల్ఫ్' (నేను). కంటికి కానరానిది, చెవి వినలేనిది, మనసుకు తెలియనిది; దివ్యమై, భవ్యమై సర్వత్రా వ్యాపించి ఉన్న చైతన్యశక్తియే నిజమైన 'సెల్ఫ్' (I). భూమి మొదలు ఆకాశమువరకు సర్వత్రా నిండినటువంటి సర్వజీవులుకూడను భగవంతునిచే సృష్టింపబడినవి. అన్నీ భగవత్స్వరూపములే! 'నేను వేరు, వారు వేరు' అని అనుకుంటున్నావు. అది చాలా పొరపాటు. అందరూ ఒక్కటే. 'ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి', ఈ జగత్తునందు రెండవది లేనే లేదు.

**సర్వతః పాణి పాదం తత్సర్వతోక్షి శిరోముఖం**
**సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి**

భగవంతుడు కానటువంటిది ఏదికూడను ఈ జగత్తులో మనకు కానరాదు. "ఇది కాదు, అది అవును" అని చెప్పుటకు ఎవ్వరికీ అధికారము లేదు; సర్వమూ భగవత్స్వరూపమే. కష్టము, నష్టము, దుఃఖము అన్నీకూడను భగవత్స్వరూపములే! ఇట్టి సత్యాన్ని తెలుసుకోగలశక్తి మనయందు ఉండినప్పటికీ మనము తెలుసుకొనలేకపోతున్నాము. ఈ లోకంలో ఎంతో విశాలమైన భూములు ఉన్నాయి; గంగా, యమునా, సరస్వతీ, పినాకినీ, కావేరీ, తుంగభద్రా, గోదావరీ ఇత్యాది జీవనదులు ఎన్నియో ప్రవహించుచున్నవి. ఇన్ని నదులు ఉండి కూడను, ఇంత విశాలమైన భూమి ఉండికూడను మానవుడు తిండిలేక అవస్థ పడుతున్నాడు. కారణమేమిటి? తనయందున్న శక్తి సామర్థ్యములను

sri sathyasai vahini

వినియోగించుకొనకపోవడమే! తనయందున్న శక్తిని దుర్వినియోగం చేస్తున్నాడు; తన తెలివితేటలను వ్యర్థం చేస్తున్నాడు. మానవుడు చక్కగా ప్రయత్నం చేసినప్పుడు సర్వముకూడను సిద్ధిస్తుంది.

**నిన్ను నీవు తెలుసుకో!**

ఈ జగత్తునందు కనిపించే ప్రతి పదార్థముకూడను పరమాత్మయొక్క స్వరూపమే అని మీరు విశ్వసించాలి. జగత్తులో ఉన్నది ఒక్కటే ఒక్కటి; రెండవది లేనే లేదు. అటువంటి సత్యమును గుర్తించుకొనలేక మీరు అనేక విధములైన భ్రమలకు లోనవుతున్నారు. ఎవరో వ్రాసిన గ్రంథములను చదివి వాటిని విశ్వసిస్తున్నారు. కాని, ఆత్మతత్త్వమును విశ్వసించడం లేదు. ఆత్మవిశ్వాసము ఎవరియందూ కానరావడంలేదు. అన్నిరకములైన 'కాన్ఫిడెన్సు'లూ ఉన్నాయికాని, 'సెల్ఫ్ కాన్ఫిడెన్సు' మాత్రం లేదు. అది లేనప్పుడు ఎన్ని ఉండి ప్రయోజన మేమిటి? అది ఒక్కటి ఉండెనా, ఈ లోకంలో మనము సాధించలేనటువంటిది ఏ ఒక్కటీ ఉండదు. దివ్యమైన, భవ్యమైన, నవ్యమైనటువంటి ఆత్మతత్త్వమును గుర్తించుకోవడానికి మనము ప్రయత్నించాలి. కాని, ఈనాడు మానవుడు తనను తాను గుర్తించుకోవడానికి ప్రయత్నం చేయటం లేదు. తానెవరో చెప్పమని అడిగితే – తన పేరు, తన తల్లిదండ్రుల పేర్లు చెబుతాడు. అదే మాట భగవంతుణ్ణి అడగండి, "అహం బ్రహ్మాస్మి", "నేను బ్రహ్మను" అని చెబుతాడు. మనము ఈ సత్యమును గుర్తించుకొనలేక అనేకవిధములుగా పెడమార్గం పట్టి తబ్బిబ్బుపడుతున్నాము. మనము తెలుసుకోవలసినదానిని తెలుసుకోవడానికి కృషి చేయటం లేదు; తెలుసుకోలేనటువంటిదానిని తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాము. సర్వత్రా నిండిన దైవత్వాన్ని తెలుసుకోవడానికి సాధ్యమవుతుందా? సాధ్యం కాదు, 'ఇంపాజిబుల్'! ఏది జరిగినా అంతా భగవత్సంకల్పమే అని మనము భావించాలి. 'నాది, నీది' అనే భావముచేతనే అన్ని భేదములూ అభివృద్ధి అవుతున్నాయి. నిజానికి 'నీవు, నేను' అనే భేదమే లేదు. You and I are one. దైవత్వము ఎక్కడో ప్రత్యేకంగా ఉన్నదని మీరు భావించకండి. "నేనే దైవము. నేను ఈ దేహముతో ఉన్నాను. కాని, ఈ దేహము నేను కాదు" అని గుర్తించండి. దేహము ఒక నీటిబుడగ, మనస్సు ఒక పిచ్చికోతి. బుద్ధి అనేది

srisathyasaivachanamrutam

చలిస్తున్నది. కనుక, నీవు దేహము కాదు, మనస్సు కాదు, బుద్ధి కాదు. నీవు నీవే. ఇటువంటి సత్యాన్ని గుర్తించడానికి కృషి చేయాలి.

**పుత్రకామేష్టి క్రతువు - శ్రీరామ జననము**

రేపటి దినము శ్రీరామనవమి, శ్రీరాముడు పుట్టిన దినము. దీనికి ఒక కథ ఉన్నది. త్రేతాయుగమునందు దశరథ మహారాజుకు కోసల దేశపు రాజు కుమార్తె అయినటువంటి కౌసల్యతో వివాహం జరిగింది. కొంత కాలమునకు వారికొక ఆడబిడ్డ పుట్టింది. ఆమె పేరు శాంత. ఆమెను దశరథుడు తన మిత్రుడైన రోమ పాదునికి దత్తత ఇచ్చాడు. దశరథుడు తనకు పుత్ర సంతానం కలగాలని ఆశించాడు. కాని, ఆ తరువాత అతనికి మళ్ళీ సంతానం కలుగలేదు. ఆనాటి న్యాయ శాస్త్రము ప్రకారం రెండవ పెండ్లి చేసుకోవాలంటే, మొదటి భార్య అనుమతి ఉండాలి. దశరథుడు కౌసల్య అనుమతితో సుమిత్రను పెళ్ళి చేసుకున్నాడు. కాని, ఆమెకుకూడా సంతానం కలుగలేదు. దాంతో దశరథ మహారాజు చాలా విచారిస్తూ వచ్చాడు. ఒకనాడు ఎక్కడి నుంచియో ఒక వార్త వచ్చింది. కేకయ రాజు కుమార్తె చాలా అందమైనదని, ఆమెను వివాహమాడమని ఒకరు సలహా ఇచ్చారు. దశరథుడు కేకయరాజును కలుసుకొని అన్ని విషయములూ తెలిపాడు. అతను అసత్యమాడేటటువంటివాడు కాదు. "సత్యాన్నాస్తి పరో ధర్మః" కాబట్టి, ఉన్న విషయమునంతా విన్నవించాడు. అప్పుడా కేకయరాజు "దశరథా! నీకు ఇరువురు భార్యలున్నారు. వారికి పిల్లలు లేరు. ఇప్పుడు నా బిడ్డను మూడవ భార్యగా కోరుతున్నావు. నా బిడ్డను నీకిస్తాను. అయితే, నా బిడ్డకు పుట్టినటువంటి పుత్రునికి మాత్రమే నీవు పట్టము కట్టాలి" అని షరతు విధించాడు. తప్పక అట్లే చేయగలనని దశరథుడు మాట ఇచ్చాడు. అది అక్కడే ఉన్న మంథర విన్నది. మంథర కైకేయియొక్క ప్రధాన చెలికత్తె.

సరే, దశరథునికి కైకేయితో వివాహం జరిగింది. ఆనందంగా వారు అయోధ్యకు తిరిగి వచ్చారు. కాని, ఎంతకాలమైనప్పటికీ కైకేయికికూడా సంతానం కలుగలేదు. అప్పుడు అందరియొక్క ప్రోద్బలముచేత దశరథుడు పుత్రకామేష్టి యాగమును తలపెట్టాడు. శాంత, ఆమె భర్త ఋష్యశృంగుడు ఇరువురూ వచ్చి ఈ మంగళకార్యమును జరిపించారు. ఆ

srisathyasaivachanamrutam

అగ్నిహోత్రమునుండి ఒక మహాపురుషుడు ఉద్భవించి దశరథుని చేతికి ఒక పాయసపు పాత్రనిచ్చి అంతర్ధానమైనాడు. ఆ పాయసమును మూడు బంగారు గిన్నెలలో పోసి ముగ్గురు రాణులకూ సమానంగా పంచారు. వివాహ సమయంలో దశరథుడు ఇచ్చిన మాట ప్రకారం తనకు పుట్టబోయే కుమారునికే తప్పక పట్టము కడతాడనే నమ్మకం కైకకు ఉండినది. కౌసల్య పట్టపురాణి. కాబట్టి, తనకు పుట్టిన కుమారునికి దశరథుడు పట్టము కట్టే తీరాలని ఆమె భావించింది. కాని, సుమిత్రకు అటువంటి ఆశ లేదు. ఆమె అభ్యంగ స్నానమాచరించి తన పాయసపు గిన్నెను మేడపైన పెట్టి కురులార్పుకుంటూ ఉన్నది. ఇంతలో ఒక గరుడ పక్షి వచ్చి ఆ గిన్నెను ఎత్తుకొనిపోయి ఒక పర్వతంపైన ధ్యానము చేసుకుంటున్న అంజనాదేవి ఎదుట జారవిడిచింది. ఆ పాయసాన్ని అంజనాదేవి భుజించగా ఆమె గర్భములో హనుమంతుడు జన్మించాడు.

కౌసల్య కుమారునికి అతని జాతక, నక్షత్రములను బట్టి 'శ్రీరాముడు' అని పేరు పెట్టారు. కైకేయి కుమారునికి 'భరతుడు' అని పేరు పెట్టారు. అయితే, సుమిత్రకు మాత్రం ఇద్దరు పిల్లలు పుట్టారు. కారణ మేమిటి? తన పాయసపు గిన్నెను గరుడుడు తన్నుకొని పోయినప్పుడు ఆమె బాధపడుతూ క్రిందికి దిగి వచ్చి కౌసల్య, కైకేయిలకు ఆ విషయం చెప్పింది. అప్పుడు కౌసల్య ఆమెను ఓదార్చి, తన పాయసంలో అర్ధ భాగమును ఒక గిన్నెలో పోసి ఆమెకిచ్చింది. కైకకూడా తన పాయసంలో సగభాగమును ఆ గిన్నెలో పోసింది. కనుకనే, సుమిత్రకు ఇద్దరు పిల్లలు పుట్టారు. వారికి లక్ష్మణ, శతృఘ్నులని పేరు పెట్టారు. అయితే, వారిరువురూ ఎప్పుడు చూసినా ఏడుస్తూ ఉండేవారు. పాలు త్రాగేవారు కాదు, నిమిషమైనా నిద్రించేవారు కాదు. యంత్రములు, మంత్రములు, తంత్రముల వలన ఏమాత్రం ప్రయోజనం లేకపోయింది. కట్టకడపటికి సుమిత్ర వసిష్ఠులవారి దగ్గరకు పోయి తన పిల్లల పరిస్థితి వివరించింది. అప్పుడు వసిష్ఠులవారు కన్నులు మూసుకొని ఒక్కసారి యోగదృష్టితో చూసి, "అమ్మా! నీకు కౌసల్య ఇచ్చిన పాయసమునుండి పుట్టినవాడు లక్ష్మణుడు, కైకేయి ఇచ్చిన పాయసమునుండి పుట్టినవాడు శతృఘ్నుడు. కనుక, లక్ష్మణుడు రామునియొక్క అంశము, శతృఘ్నుడు భరతునియొక్క అంశము. నీవు కౌసల్యవద్దకు వెళ్ళి ఆమె అనుమతి తీసికొని ఆమె కుమారుడు ఉన్నటువంటి ఊయలలో లక్ష్మణుణ్ని

sri sathyasai vahini amrutam

పరుండబెట్టు; అట్లే, కైక కుమారుడైన భరతుని ప్రక్కన శతృఘ్నుణ్ని పరుండబెట్టు", అని సలహా ఇచ్చారు. వసిష్ఠులవారి సలహా ననుసరించి సుమిత్ర రాముని ప్రక్కన లక్ష్మణుణ్ని, భరతుని ప్రక్కన శతృఘ్నుణ్ని పరుండబెట్టగానే వారిరువురూ ఏడుపు మాని హాయిగా నిద్రించారు. తరువాత ఆడుకుంటూ నిద్రలేచారు. వారి ఆనందము చూసి సుమిత్ర మనసు తేలికపడింది. ఆనాటినుంచి రాముని విడిచి లక్ష్మణుడు, భరతుని విడిచి శతృఘ్నుడు క్షణమైనా ఉండేవారు కాదు. అందుచేత, సుమిత్ర ప్రతి దినమూ కౌసల్య, కైకేయిల వద్దకు వెళ్ళి, తన కుమారుల ఆటపాటలను చూసి, వారిని ఆనందంతో ముద్దాడి వచ్చేది. ఈవిధంగా, అన్నదమ్ములు నలుగురూ ఎంతో అన్యోన్యంగా, ఆదర్శంగా, ఐకమత్యంగా మెలగుతూ వచ్చారు.

**సీతారామ కల్యాణము**

రామలక్ష్మణులు విశ్వామిత్రుని యాగ సంరక్షణ గావించిన తరువాత ఆయన వారిరువురినీ మిథిలకు తీసికొని వెళ్ళగా, అక్కడ రాముడు శివధనుర్భంగము గావించి, తన తల్లిదండ్రుల అనుమతితో సీతను పరిణయమాడినాడు. సీతారాముల కల్యాణమును చూడడానికి ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చారు.

రారే చూడగపోదాము రాముల పెండ్లి
రారే చూడగపోదాము రమణులందరు కూడి
వింతల బంగళాలు ముత్యపు తోరణాలు
మూలల కిటికీలు, వజ్రాల తలుపూలు
తాపిన నీలాలు, నీలాలు వెయ్యార్లు
నూరార్లు బజార్లు ॥రారే॥
స్త్రీల కెక్కువ భూషణాలు ముందర దర్బార్లు
సీతకు రాముడు సూత్రము గట్టుతాడు
ఇద్దరి నొక్క ఈడు జోడుగ కూర్చినాడు
సీతకు తగువాడు శ్రీరాముడు ॥రారే॥
మించి మగల కడనుంచి సిగ్గున తలవంచి



srisathyasaivachanamrutam

వసిష్ఠ రప్పించి, ఖడ్గములు తెప్పించి
గుఱ్ఱాలపై గుప్పించీ, గుప్పించి ఇప్పించి
మెప్పించి రప్పించి ॥రారే॥

అని పాడుకుంటూ స్త్రీలు తరలి వస్తుంటే, మగవారు మరొకవిధంగా పాటలు పాడుకుంటూ వచ్చారు.

కల్యాణము చూతము రారండి
కౌసల్యా తనయుని
కల్యాణము చూతము రారండి
చూచువారలకు చాల పుణ్యమట
పుణ్యపురుషులకు ధన్య భాగ్యమట ॥కల్యాణ॥
పిల్లన గ్రోవులు భేరి మృదంగము
రథములు గజములు తురగములేనట
వారి వెంట గొని వృద్ధ కౌశికుడు
కౌశికు వెంట వృద్ధ దశరథుడు
దశరథు వెంట మంత్రి సుమంతుడు
అత్యద్భుతముగ ఆనందముగా
అయోధ్య అంతయు కదలి వచ్చెనట ॥కల్యాణ॥

కల్యాణ మహోత్సవము తరువాత అందరూ కలసి మిథిలనుండి అయోధ్యకు బయల్దేరారు. మార్గ మధ్యంలో వారికి ఒక పెద్ద శబ్దం వినిపించింది. ఎక్కడినుండి వచ్చిందీ శబ్దం అని అందరూ ఆశ్చర్యపడుతుండగా పరశురాముడు వచ్చి "శివధనుస్సును విరిచినవారెవరు?" అంటూ వారిని అడ్డగించాడు. రాముడు ముందుకు వచ్చి "నేనే విరిచాను" అన్నాడు. "ఓహో, నీవా? అయితే, దీనిని విరుచు, చూద్దాం" అని చెప్పి రాముని చేతికి మరొక ధనుస్సు నిచ్చాడు. రాముడు దానినికూడా సులభంగా విరిచాడు. అప్పుడు పరశురాముడు తనవద్దనున్న రెండు కళలను రామునికి అర్పితం చేశాడు. అవతార పురుషునిలో ఉండవలసిన 16 కళలలో రామునియందు 12 కళలు ఉండినాయి. మిగిలిన ముగ్గురు



srisathyasai vachanamrutam

సోదరులలో రెండు కళలు చేరిపోయినాయి. ఇక, పరశురామునియొక్క రెండు కళలుకూడా తనలో చేర్చుకునేసరికి రాముడు షోడశకళా పరిపూర్ణుడై ప్రకాశించాడు.

కొంతకాలమునకు దశరథుడు తనకు వృద్ధాప్యం సంప్రాప్తమైనదని గ్రహించి, పట్టపురాణి కుమారుడైన శ్రీరామునికి రాజ్యాభిషేకము చేయాలని సంకల్పించు కున్నాడు. రాజ్యమంతా ఆనందించింది. రాజ్య పరిపాలనకు రాముడే అర్హుడని అందరూ భావించారు. ఈ వార్త విని మంథర కైకవద్దకు వెళ్ళి "అమ్మా, నిన్ను వివాహమాడే సమయంలో దశరథుడు మీ నాన్నగారికి ఇచ్చిన మాట మరచిపోయాడు. అసలు నీ కుమారునికే పట్టము కట్టాలి" అని చెప్పింది. అంతేగాక, దశరథుడు దేవాసుర యుద్ధ సమయంలో తనకు సహాయము చేసినందుకుగాను ఆమెకు రెండు వరములిచ్చిన సంగతికూడా గుర్తు చేసి, ఆ వరములు కోరడానికి అదే తగిన సమయమని చెప్పింది. నిజానికి కైకేయి రాముణ్ని తన కుమారుడైన భరతునికన్న మిన్నగా ప్రేమించింది. కాని, మంథరయొక్క దుర్బోధలచేత ఆమె మనసు కలుషితమై తక్షణమే తన నగలన్నీ తీసి పారవేసి క్రోధగృహంలోకి ప్రవేశించింది.

**శ్రీరాముని పితృవాక్య పరిపాలన**

శ్రీరామ పట్టాభిషేక వార్తను ముందుగా కైకకు తెలుపుదామని దశరథుడు ఆమెవద్దకు వెళ్ళేసరికి ఆమె క్రోధగృహంలోకి ప్రవేశించిందని తెలిసి నిరాశ చెందాడు. కారణమేమిటో కనుక్కొని ఆమె కోరిన రెండు వరములు చెల్లిస్తానని మాటిచ్చాడు. అప్పుడు కైక తన కుమారుడైన భరతునికి పట్టాభిషేకము చేయాలని తన మొదటి కోరికను వ్యక్తం చేసింది. తన రెండవ కోరిక మాత్రం చాలా కఠినమైనటువంటిది కోరింది. "రాముణ్ని పదునాల్గు సంవత్సరములు అరణ్యానికి పంపాలి", అన్నది. దారుణమైన ఆ కఠినపు మాటలకు దశరథుడు తల్లడిల్లిపోయాడు. "తప్పక నీ కుమారునికే పట్టము కడతాను. కాని, రాముడు అరణ్యవాసము చేయాలనే తలంపు విడిచిపెట్టు" అని ఆమెకు నచ్చజెప్పడానికి ఎంతగానో ప్రయత్నించాడు. అయితే, కైక తన పట్టు వీడలేదు. ఈవిషయం తెలిసి రాముడు పితృవాక్య పరిపాలనయే తన కర్తవ్యంగా భావించి తక్షణమే అరణ్యానికి బయల్దేరడానికి సిద్ధపడ్డాడు.

sri sathyasai vahamrutam

కాని, లక్ష్మణునికి చాలా కోపం వచ్చింది. ఒక్క క్షణంలో వెళ్ళి కైకను, మంథరను చంపాలని అనుకున్నాడు. కాని, రాముడు "లక్ష్మణా! పితృవాక్య పరిపాలన మనకు చాలా ప్రధానమైనటువంటిది. తండ్రి మాటను మనము జవదాటకూడదు" అని చెప్పి అతనిని శాంతింపజేశాడు. "ఈ నిమిషమే మీరు అరణ్యానికి బయల్దేరాలి" అని కైక ఆదేశించింది. తక్షణమే సీతారామలక్ష్మణులు రథమెక్కి బయల్దేరారు.

అరణ్యానికి వెళ్ళేముందు లక్ష్మణుడు తన తల్లి సుమిత్రవద్దకు వెళ్ళి ఆమె ఆశీస్సులు అందుకున్నాడు. సుమిత్ర మహాగుణవంతురాలు. ఆమె పేరే 'సు–మిత్ర', అనగా మంచి మిత్రురాలు. ఆమె తన కుమారుని నిర్ణయానికి ఎంతగానో ఆనందించింది. ఆ తరువాత లక్ష్మణుడు తన భార్య ఊర్మిళవద్దకు వెళ్ళాడు. ఆమె మంచి పెయింటర్. ఆ సమయంలో ఆమె శ్రీరామ పట్టాభిషేకము యొక్క వర్ణచిత్రాన్ని చిత్రిస్తున్నది. అది చూసి లక్ష్మణుడు, "ఇంక పట్టాభిషేకము ఎక్కడుంది? రాముడు అరణ్యానికి వెళుతున్నాడు" అంటూ జరిగిన సంగతి అంతా ఆమెకు వివరించాడు. సీతారాములకు సేవచేసే నిమిత్తం తానుకూడా వారివెంట అరణ్యానికి వెళుతున్నట్లు తెలియజేశాడు. ఊర్మిళ ఏమీ అడ్డు చెప్పలేదు. పైగా, సీతారాములకు సేవచేసే అదృష్టం తన పతికి లభించినందుకు ఆనందించింది. "సీతారాములను మీ తల్లిదండ్రులుగా భావించి, కంటికి రెప్పవలె జాగ్రత్తగా చూసుకోండి. ఈ పద్నాల్గు సంవత్సరములు అరణ్యంలో మీరు నా పేరునుగాని, నా రూపమునుగాని ఏమాత్రం చింతించకండి. సీతారాములను మాత్రమే దృష్టిలో పెట్టుకోండి", అని చెప్పి ఊర్మిళ లక్ష్మణుని పాదాలకు నమస్కరించింది.

**శ్రవణ కుమారుని వృత్తాంతము**

సీతారామలక్ష్మణులు ముగ్గురూ రథమునెక్కి అరణ్యమునకు ప్రయాణమై వెళుతుంటే దశరథుడు రథము వెంట పరుగిడుతూ, "రామా, ఒక్క నిమిషము నేను నిన్ను చూచి పంపిస్తాను. కొంతసేపు ఆగు, ఆగు, ఆగు" అన్నాడు. కాని, తక్షణమే వెళ్ళవలసిందిగా ఆజ్ఞ ఇచ్చింది, కైక. ఆమె ఆజ్ఞను శిరసావహించి రాముడు రథమును ఆపకుండా ముందుకు వెళ్ళాడు. ఆనాటి నుంచి దశరథుడు ఏ ఆహారముకూడా పుచ్చుకోలేదు; ఒక్క చుక్క నీరైనా



sri sathyasai vahanamrutam

త్రాగలేదు. నిరంతరం 'రామా, రామా' అని రామనామమును స్మరించుకుంటూ ప్రాణం వదిలాడు. అయితే, దీనికి తగిన కారణము లేకపోలేదు.

శ్రవణ కుమారునికి వృద్ధులయిన తల్లిదండ్రులు ఉండేవారు. వారిరువురికీ కన్నులు లేవు. అతను ఒక కావడికి ఇరువైపులా రెండు వెదురుబుట్టలు అమర్చి, ఒకవైపున తల్లిని, మరొకవైపున తండ్రిని కూర్చోబెట్టి, దానిని తన భుజముపైన పెట్టుకొని మోస్తూ వారిచేత అన్ని తీర్థయాత్రలూ చేయించాడు. ఒక పర్యాయం దశరథుడు వేట నిమిత్తం అరణ్యానికి వెళ్ళాడు. అక్కడ ఒక సరోవరములో పొదలమధ్య అతనికి ఏదో కదిలినట్లుగా కనిపించింది, శబ్దము వినిపించింది. తల్లిదండ్రులకు నీళ్ళు తీసుకువెళ్ళడానికి వచ్చిన శ్రవణ కుమారుడు ఆ కొలనులో నీటిపైన కప్పిన పాచిని తొలగించే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ శబ్దము విని అదేదో జంతువని భావించి, దశరథుడు శబ్దభేదిని ఎరిగినవాడు కావడంచేత బాణమును సంధించి ప్రయోగించాడు. అంతలో 'హా' అని కూలిన శబ్దము వినిపించింది. దశరథుడు వెళ్ళి చూడగా అక్కడ కనిపించింది మృగము కాదు, ఒక ఋషి కుమారుడు. తన పొరపాటును గ్రహించి దశరథుడు ఖిన్నుడైనాడు. అప్పుడు శ్రవణ కుమారుడు, "ఓ రాజా! నా తల్లిదండ్రులు దాహముచేత కష్టపడుతున్నారు. కావున, ఈ నీళ్ళు త్వరగా తీసికొని వెళ్ళి వారికి అందించు. వారు నీళ్ళు త్రాగిన తరువాతనే నా మరణవార్త తెలియజేయి" అన్నాడు. కుమారుని మరణవార్త తెలియగానే ఆ వృద్ధ ముని దంపతులు దుఃఖము భరించుకోలేక, "ఓ రాజా! ఇప్పుడు మేము మా కుమారుని వియోగముచే ఎట్లు మా ప్రాణములు విడుస్తున్నామో అట్లే నీవుకూడా పుత్రవియోగముచేతనే మరణించెదవు" అని చెప్పి ప్రాణములు విడిచారు. మహర్షులయొక్క శాపమును మరలించుటకు వీలుకాదు.

రాముడు పదునాలుగేళ్ళు అరణ్యవాసమును ముగించుకొని అయోధ్యకు తిరిగి వచ్చినప్పుడు ప్రజలందరూ 'రామా, రామా' అని ఆనందంగా ఆడుతూ పాడుతూ స్వాగతం పలికారు. రాముడు పుట్టిన దినమున మాత్రమే మనము రాముణ్ని తలుచుకొని పూజలు చేస్తే సరిపోదు; మన నిత్య జీవితంలో రాముని ఆదర్శాలను ఆచరణలో పెట్టాలి. ఈనాటికి ఎన్నో వేల సంవత్సరాలు గడచినప్పటికీ రామనామము ఇప్పటికీ నిత్యనూతనంగా ఉంటున్నది. రాముడు ఎల్లప్పుడు నిత్యనూతనుడే. రామనామము సర్వులకు

srisathyasaivachanamrutam

ప్రీతికరమైనది. ఇది అందరూ సులభంగా ఉచ్చరించగలిగేటటువంటిది. ఏ వృద్ధురాలివద్దకైనా వెళ్ళి, "ఏం చేస్తున్నారు అవ్వగారూ?" అని అడిగితే, "ఏమి చేస్తాను నాయనా? మంత్రాలు వల్లించటానికి నాకు నోరు తిరగదు. కాబట్టి, 'రామా, రామా, రామా' అని రామనామమును తలుచుకుంటున్నాను", అని చెబుతుంది. భారతదేశములో రామనామము తెలియనటువంటి మనిషి లేదు; రామమందిరము లేనటువంటి గ్రామము కనిపించదు. మందిరము కట్టించలేకపోయినప్పటికీ పైన రెండు షీట్లయినా వేసి అక్కడ ఒక రామవిగ్రహాన్ని పెట్టి ఉంటారు. ఈవిధంగా వేలాది సంవత్సరాలుగా రామనామము భారతదేశములో ఎంతో ప్రఖ్యాతి గాంచింది. ఇప్పుడిప్పుడు రష్యాలో కూడను రామనామాన్ని స్మరిస్తున్నారు. రామనామము ప్రపంచమంతా వ్యాప్తి చెందుతున్నది. అన్ని నామములకంటే రామనామమే ప్రధానమైనటువంటిది. కనుక, ప్రతి ఒక్కరుకూడను, ఏ పని చేసినప్పటికీ రామ నామమును స్మరించుకొని చేయండి. మీ ఇంటినుంచి బయలుదేరేముందుగాని, కాలేజికి వెళ్ళే సమయంలో కూడను ఎప్పుడూ రామనామాన్నే స్మరిస్తూ రండి. మీ ఉచ్ఛ్వాస నిశ్వాసములు సహితం రామనామముతో కూడినటువంటివిగా ఉండాలి.

**– తేదీ 13.4.2008, తమిళ సంవత్సరాది,**
**సాయికుల్వంత్ సభామండపం**

sri sathyasai vahini amrutam